క్లుప్తంగా

దాడి కేసులో ముగ్గురు నిందితులకు జరిమానా

యలమంచిలి: ఇలపకుర్రు గ్రామానికి చెందిన అయినపూడి నరసింహస్వామిపై అదే గ్రామానికి చెందిన ఆకుమర్తి సూర్యారావు, ఆకుమర్తి నాగేశ్వరరావు, ఆకుమర్తి ఏసుబాబు 2018వ సంవత్సరంలో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనపై నరసింహస్వామి పిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఆకుమర్తి సూర్యారావుకు రూ.2500, ఆకుమర్తి నాగేశ్వరరావు కు రూ.200, ఆకుమర్తి ఏసుబాబుకు రూ.200 జరిమానా విధిస్తూ బుధవారం నరసాపురం అడిషనల్ సివిల్ జడ్జి ఎస్ రాజ్యలక్ష్మీ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు.

కామ్రేడ్ రామకృష్ణకు నివాళులు



రామకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ నేలపూడి బేబీ, సీపీఎం నాయకులు

పెనుగొండ: ప్రజల కోసం జీవించి, వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి కామ్రేడ్ చిట్టూరి రామకృష్ణ అని వల్లూరు సర్పంచ్ నేలపూడి బేబీ కొనియాడారు. మాజీ సర్పంచ్, సీపీఎం నాయకుడు చిట్టూరి రామకృష్ణ 15వ వర్ధంతి సందర్భంగా సీపీఎం స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మైలే ఏసురత్నం, ఉప సర్పంచ్ గెద్దాడ శ్రీనివాస రావు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాసరావు, దేవళ్ల రమేష్, ఏడిద శ్రీనివాస రావు, ఏడిద వెంకట కృష్ణారావు, చిట్టూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై ఫిర్యాదు

భీమవరం (ప్రకాశంచౌక్): హేలాపూరి న్యూస్ జర్నలిస్టుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాలోని తహసీల్దారులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మికి బుధవారం వారి చాంబర్లలో విడివిడిగా కలిసి ఫిర్యాదులు అందజేశారు. ఇటీవల హేలాపూరి న్యూస్ జర్నలిస్టుగా చెప్పబడే కాకర విజయప్రసాద్ అనే వ్యక్తి పాలకొల్లు మండలంలో పాలకొల్లు రూరల్ గ్రామ పంచాయతీలో వేయబడిన లేఅవుట్ల విషయంలో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని ఫోన్ ద్వారా బెదిరిస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. అతడి క్రిమినల్ కేసులపై విచారణ జరిపి తహసీల్దార్లు, కిందిస్థాయి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం



మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి

భీమవరం: మధ్యవర్తిత్వం చేసేసమయంలో కేసు రాజీ పడినా లేకున్నా గోప్యత పాటించాలని, రాజీ పడితే రాజీ షరతులు నమోదు చేయాలని భీమవరం రెండోవ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి అన్నారు. మధ్యవర్తిత్వంపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదుల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో మధ్యవర్తిత్వం ద్వారానే కేసులు ఎక్కువగా పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మీడియేషన్ న్యాయవాదులు స్టీఫెన్‌బాబు, హరి, విజయలక్ష్మి, ప్యానల్ న్యాయవాదులు సురేష్‌కుమార్, అంబేడ్కర్, సుధీర్, జ్యోతి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. వనజ

భీమవరం(ప్రకాశంచౌక్): సహజంగా లభించే సౌర శక్తిని వినియోగించుకొని ఎటువంటి కాలుష్యం లేని సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని ఏపీఈపీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విజయవంతం చేయాలని ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. వనజ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ఉచితంగా లభించే సౌరశక్తిని వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తిని సాధించడానికి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ నరహరశెట్టి వెంకటేశ్వరరావు, ఏడీఈలు కొత్తపల్లి రాంబాబు, టి. వెంకట్రావు, యు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

- విచిత్ర పరిస్థితితో తలలు పట్టుకుంటున్న రైతులు
- విపరీతమైన ఎండలతో సాగు కుదేలు



చినమల్లంలో మోటార్లతో నీరు తోడుకుంటున్న రైతన్నలు



చిన్నంవారిపాలెంలో పవర్ టిల్లరుతో దమ్ములు



పెనుగొండలో ట్రాక్టరుతో దమ్ములు



గట్టు లంకలు వేసుకొంటున్న రైతన్నలు

పెనుగొండ: ఖరీఫ్ సాగు ఆరంభంలోనే భారంగా మారడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతి ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులకు తోడు, ఈ ఏడాది సాగునీటికీ ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో రైతులకు అదనపు భారంగా మారింది. నియోజక వర్గంలో పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లోనూ ఆచంట మండలంలో 10600 ఎకరాల్లో , పోడూరుమండలంలో 12800 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రుతుపవనాలు ముందస్తుగా ప్రారంభం కావడంతో సాగుకు ఇబ్బందులు ఉండవన్న బావనతో రైతులు సాగుకు శ్రీకారం చుట్టారు. రైతుల ఆశలపై నీళ్లు జల్లుతూ ఎండల తీవ్రత తిరిగి ప్రారంభం కావడంతో నియోజకవర్గంలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు.

తీవ్రమైన నీటి ఎద్దడి

నీటి ఎద్దడి నివారణ చేయాలంటూ రైతులు మొరపెట్టుకొన్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో రైతులు మోటార్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో రైతులు మోటార్ల కోసం రెండు వేల రూపాయలకుపైగా అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే గతం కంటే ఖర్చులు పెరిగాయని, ఈ తరుణంలో ఇంజన్ల ఖర్చు పెనుభారంగా మారిందన్నారు. నారుమడికి రూ. 4 వేలు, నాట్లు వేయడానికి రూ.6 వేలు, ఎరువులు, సస్యరక్షణకు మరో రూ. 20 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని వివరించారు. దీంతో పాటు కోతలకు రూ. 5వేలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. ఇదిలా ఉండగా సాగు మధ్యలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు లేకపోతే, కనీస పెట్టుబడులతో గట్టెక్కుతున్న రైతులకు అకాల వర్షాలు, తుపాన్లు మరింత పెట్టుబడులు పెంచి నష్టాల ఊబిలో నెట్టేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది పెనుగొండ మండలంలో నడిపూడి, వడలి, కొఠాలపరు తామరాడ గ్రామాల్లోనూ, ఆచంటలో ఆచంట వేమవరం, కోడేరు, వల్లూరు, పెనుమంచిలి గ్రామాల్లో సాగునీటి ఖర్చులు పెరిగాయని రైతులు వివరించారు. ఆచంట వేమవరంలో మరీ దారుణంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం సాగు నీటి ఇబ్బందులు తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం సాగు ప్రారంభానికి ముందే రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించేదని, ఈ ఏడాది జూలై నెలకు చేరినా ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించడంలేదని రైతులు వాపోతున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎస్‌పీఆర్ఆర్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పిఎల్‌కే స్కూల్ విద్యార్థులకు పానకాల రాయ రామ మోహన్ క్లబ్ (ఎస్‌పీఆర్ఆర్) సేవా సంస్థ సభ్యులు నోట్ పుస్తకాలను అందించారు. బుధవారం క్లబ్ సెక్రటరీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మామిడి బాబు మాట్లాడుతూ పాఠశాలలో 340 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించామన్నారు. పట్టణంలో ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు తమ క్లబ్ తరుపున నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. పుస్తకాలతో పాటు పెన్సిల్స్, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎన్.బాపిరాజు, గాదె సత్యనారాయణ, చోడిశెట్టి జ్ఞానశంకర్, జె.ఉప్పరి, ఎం.రామానుజం, పీవీ అప్పాజి పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

నరసాపురం రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లోని దివ్యాంగులు, వృద్ధులకు వివిధ రకాల పరికరాలు అందజేసేందుకు లబ్ధిదారుల పేర్ల నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పేర్ల నమోదుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 18న ఉదయం 9గంటలకు నరసాపురం మున్సిపల్ ఆఫీస్ వద్ద హాజరుకావాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న అమ్మ ట్రస్ట్ సభ్యులు, పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఓ అనాథ మృతదేహానికి స్థానిక అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఓ అనాథ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. గత మూడేళ్లుగా టిఫిన్ హోటల్స్‌లో పనిచేసేవాడని గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్థానికులు తెలిపినట్లు పోలీసులు చెప్పారు. అతని కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు ముందుకు వచ్చి బుధవారం ఆ మృతదేహానికి యడ్లబజారు సెంటర్ వద్ద హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ ఎస్సై పృథ్వీ, ట్రస్ట్ అధ్యక్షులు అంబటి సాయితేజ, కట్టా సాయికిరణ్, కందుల సాయి, అనిశెట్టి శ్రీరామదాసు, పోలీసులు నగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పాఠశాల భద్రత, ఆరోగ్య దినోత్సవం



జాతీయ భద్రత, ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రమాదకరమైన పరిస్థితులు సంభవించినప్పుడు తొక్కిసలాట లేకుండా సంయమనం పాటిస్తూ ఆ ప్రమాదకర పరిస్థితుల నుండి ఎలా బయటకు రావాలనే విషయాలపై అవగాహనతో ఉండాలని హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ పాఠశాల భద్రత, ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ 2004 జులై 16న తమిళనాడు కుంభకోణంలో అగ్నిప్రమాదం జరిగి 90 మంది చిన్నారులు మరణించారని అన్నారు. ఆ సంఘటనకు స్పందించి భారత ప్రభుత్వం జూలై 16న జాతీయ పాఠశాల భద్రత, ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధూసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్ద చర్మ వ్యాధి రాకుండా పశువులకు టీకాలు



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో వీధిలో తిరిగే పశువులకు అలాగే పెంపుడు పశువులకు ముద్ద చర్మవాపు వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం సుమారు 100 పశువులకు టీకాలు వేశామన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ముద్ద చర్మ వ్యాధి వైరస్ ద్వారా పశువులకు సోకుతుందన్నారు. ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు జ్వరం,చర్మంపై ముద్దలు, పుండ్లు, పాలు తగ్గుదల వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. వ్యాధి నిరోధించడానికి ముందుగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ నెల 31 వరకూ ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో ఉన్న యలమంచిలి, పాలకొల్లు మండలంలో టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు.

భార్య కనిపించడం లేదంటూ భర్త ఫిర్యాదు

భీమవరం: తన భార్య కన్పించడం లేదంటూ భీమవరం పట్టణం బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న పోతుల లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ శేషావతారం బుధవారం చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన లక్ష్మణరావు భార్య దుర్గాభవాని పిల్లతో కలసి పట్టణంలోని బ్యాంక్ కాలనీలో నివాసముంటున్నారు. వారం రోజులు క్రితం భార్య మరొక వ్యక్తితో చనువుగా ఉండడంతో లక్ష్మణరావు మందలించాడు. దీంతో మంగళవారం రాత్రి తాను ఇంటిలో లేని సమయంలో వెళ్లిపోయిందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు శేషావతారం తెలిపారు.

అరాచక పాలన అరికట్టేలా పనిచేయాలి



నూతన కమిటీ అధ్యక్షులను అభినందిస్తున్న పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతుందని దీనిని అరికట్టాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఉందని నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతనంగా పదవులు పొందిన నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడం లేదని అన్నారు. ఇచ్చింది గోరంత అయితే ప్రచారం మాత్రం కొండంత చేస్తున్నారని విమర్శించారు. తల్లికి వందనం ఒక్కో కుటుంబంలో నలుగురు, ఐదుగురు, ముగ్గురుకి అందిందని ప్రచార హోర్డింగులతో నియోజకవర్గంలో హోరెత్తిస్తున్నారని అలాగే ఇద్దరు ముగ్గురు ఉన్న కొన్ని కుటుంబాల్లో ఒక్కరికి కూడా తల్లికి వందనం అందని వారు ఉన్నారని వారి ఫ్లెక్సీలు కూడా వేసి కూటమి నేతలు వారి సచ్చీలతను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూత్ వింగ్ అధ్యక్షుడు యాతం నానాజీ, డాక్టర్స్ వింగ్ అధ్యక్షులు చేగొండి కిషోర్ కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, బండి రమేష్, ఉండ్రాజవరపు రవి, పిట్టా రాజ్‌కుమార్, కెల్లా పెద్దిరాజు, కోట రత్నరాజు, వీరా మల్లిఖార్జునుడు, గానుబోయిన దుర్గారావు, పాలపర్తి కృపానాధ్, నక్క చిత్తరంజన్ దాస్, దేవ రాజేష్, గుడాల సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాలను పరిష్కరిస్తాం



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

కాళ్ల: జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా మండలంలోని కోలనపల్లి, సీసలి, కోపల్లె, పెదమిరం , వేంపాడు, తదితర గ్రామాల రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం తాహసిల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ జరిపారు. భూ సేకరణ పై జూన్ 14న అభ్యంతరాలు గడువు ముగిసేనాటికి వచ్చిన 54 అభ్యంతరాల పై బుధవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్మెంట్ తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, తమ భూములు వ్యవసాయేతర భూములుగా మార్పు చెందినందున నష్టపరిహారం చదరపు గజాల్లో లెక్కించి ఇవ్వాలని రైతులు కోరగా వ్యవసాయేతర భూములుగా మార్చిన ధ్రువపత్రాలను దాఖలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. అనంతరం పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. జాతీయ రహదారి భూ సేకరణకు ఒక అభ్యంతరం లేదని, నిబంధనల మేరకు మాకు కొంచెం లాభసాటిగా ఉండేలా చూడాలని రైతులు కోరారు. సమావేశంలో ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ సుందర్ సింగ్, జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, డీటీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాను నిరోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

నరసాపురం రూరల్: మనుషుల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. బుధవారం నరసాపురం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అక్రమ రవాణా పై రెండు రోజులపాటు నిర్వహించిన అవగాహనా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ ఎంతో మంది అమ్మాయిలు మహిళలు ఈ సమస్యకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని, ఇలాంటి ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికీ అవగాహనా కల్పించి రక్షించాలని అన్నారు. ప్రజ్వల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయశాఖ సమన్వయంతో ఇప్పటి వరకు వేలాది మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించారన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్యశ్రుతి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగ బాధ్యత వృత్తి ధర్మాన్ని పాటిస్తే అవార్డులు పొందగలుగుతామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డు అందుకున్న కలెక్టర్ నాగరాణిను క్యాంప్ కార్యాలయంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, వెంకటేశ్వర స్వామి దేవస్థాన అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అభినందించి సత్కరించారు.

నడకతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో



కొత్త కుళాయి చెరువు గట్టుపై వాకింగ్ చేస్తున్న వాకర్స్ (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: నేటి ఆధునిక యుగంలో అందరూ బిజీబిజీగానే ఉంటున్నారు. కానీ దాదాపుగా 80 శాతం మందికి పెద్దగా శారీరక శ్రమ అనేది లేకుండా పోయింది. ఒత్తిడితో కూడిన శ్రమే తప్ప ఆరోగ్యకరమైన శ్రమ అయితే ఎక్కడా కనిపించడంలేదు. చిన్న అనారోగ్యం వచ్చినా వెంటనే డాక్టర్ వద్దకు పరుగులు తీయడమే తప్ప అసలు వచ్చిన అనారోగ్యం ఎందుకు వచ్చింది? దాన్ని తగ్గించుకోవడానికి మన చేతుల్లో ఏమైనా ఉందా అనే ఆలోచన నేటి యువతలో మచ్చుకు కూడా కనిపించడంలేదు. పూర్వం మన పెద్దలు అన్ని పనులు వాళ్లే చేసుకునేవారు. ఎన్ని మైళ్ల దూరమైనా సరే నడిచి వెళ్లేవారు. దానితో ఏ ఆహారం తిసుకున్నా సరే అరుగుదల పుష్కలంగా ఉండేది. కాని నేటి ఒత్తిళ్ల జీవితానికి వ్యాయామం తప్పనిసరని వైద్యులు చెపుతున్నారు.

నడకతో లాభాలివే

నడక ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. నడక వల్ల మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. వ్యాయామం చేయడం వల్ల కండరాలు, కీళ్లను బలపరుస్తుంది. మానసిక శ్రేయస్సుతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఉదయం వాకింగ్ చేయడం వల్ల కండరాలు బలోపేతం అవుతుంటాయి. రోజూ 30 నిమిషాల ఉదయాన్నే నడిస్తే ఎముకల సాంద్రతను మెరుగుపరుస్తుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం, నరాల బలహీనత వంటివి దరి చేరవు, అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను జయించవచ్చు. కీళ్లనొప్పులు తగ్గి కండరాలు శక్తి పెరిగి నడిచేందుకు వీలు కలుగుతుంది. శరీర ఆకృతి బాగుటుంది. గుండె ఊపిరితిత్తులకు రక్తప్రసరణ బాగుటుంది. మానసిక ఒత్తిడి, ఆందోళన వంటివి తగ్గించుకోవచ్చు. ఎముకలు దృడంగా ఉంటాయి. మంచి శ్వాస, అధిక స్థాయిలో ఆక్సిజన్ అందుతుంది. విటమిన్ డితో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

వాకర్స్ కోసం వాకర్స్ క్లబ్ సేవలు ఇలా

వాకింగ్ వల్ల కలిగే ఆరోగ్యం గురించి వాకర్స్ క్లబ్ సభ్యులు ఎంతో ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా వాకర్స్ కోసం అనేక మెడికల్ క్యాంపులు అలాగే వైద్య, విద్య కోసం అనేక సేవా కార్యక్రమాలు ఏర్పాటుచేస్తుంటారు. సంవత్సరం పొడవునా ప్రతీ పర్వదినాలు, ముఖ్యమైన రోజుల్లో అనేక కార్యక్రమాలు చేస్తుంటారు. వాకర్స్‌కు అవగాహన కల్పించడంలో, సేవలందించడంలో వాకర్స్ క్లబ్ అందరికంటే ముందు వరుసలో ఉండడం గమనార్హం.

పట్టణంలో పార్కులివే

పట్టణంలో వాకింగ్ చేయడానికి కుళాయి చెరువుగట్టు ఒక్కటే చాలా బాగా ఉంటుంది. ప్రస్తుతం దీనితో పాటు అబ్దుల్‌కలాం శంభుని పార్కులో పట్టణ వాసులు అధికంగా వాకింగ్ చేస్తున్నారు. పట్టణంలో దాదాపుగా ఎనిమిది పార్కులుఉన్నాయి. ఏ పార్కులు వాకింగ్ గానీ సరదాగా కాసేపు కూర్చోవడానికి గాని అనుకూలంగా మాత్రం లేవు. వాటిని పరిశుభ్రం చేస్తే ప్రతీ ఏరియాలో స్థానికులకు వాకింగ్ ట్రాక్‌లుగా ఉపయోగపడతాయి.